## నేడు హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : జనగామ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా జపాన్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఉద్యోగాలు కల్పించడానికి శనివారం (నేడు) వరంగల్ జిల్లా కేంద్రంలోని ములుగు రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ బాలుర క్యాంపస్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్ ఉమారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 22నుంచి 27ఏళ్ల మధ్య వయసుండి, హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులు అని తెలిపారు. మరిన్ని వివరాలకు 7893566493/ 9849639539/ 9100798204లో సంప్రదించాలని ఉపాధి కల్పన అధికారి ఉమారాణి సూచించారు.

## 23న జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : జనగామ జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక కార్యక్రమం డిసెంబర్ 23వ తేదీ ఉదయం 9గంటలకు స్థానిక జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి (ఇన్‌చార్జి) రంగాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 15నుంచి 29ఏళ్లలోపు ఉన్న యువ కళాకారులు అర్హులని ఆయన తెలిపారు. యువ కళాకారులకు జానపద నృత్యం (సోలో/ (గ్రూపు డ్యాన్స్), జానపద గేయాలు (సోలో/ (గ్రూపు డ్యాన్స్)తో పాటు లైఫ్ స్కిల్స్ కాంపిటేషన్ విభాగంలో కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన (డిక్లమేషన్), ఫొటోగ్రఫీలో పోటీలు ఉంటాయని తెలిపారు. దేశభక్తి, సందేశాత్మకంగా ఉండే అంశాలనే పోటీదారులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 9703033348 లేదా 9182552593లో సంప్రదించాలన్నారు.


దేవరుప్పులలో నినాదాలు చేస్తున్న తపాలా ఉద్యోగులు

## తపాలా ఉద్యోగుల సమ్మె

దేవరుప్పుల, డిసెంబర్ 15 : తమ అపరిష్కృత డిమాండ్ల సాధనకు అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగినట్టు దేవరుప్పుల తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు ఖలీల్‌పాషా, బాపూజీ, మోహన్ తెలిపారు. దేవరుప్పుల పోస్టాఫీసు ముందు శుక్రవారం తపాలా ఉద్యోగులు తమ డిమాండ్లతో కూడిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగులకు కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించడంలో విఫలమైన నేపథ్యంలో ఈ నెల 12నుంచి నిరవధిక సమ్మెకు దిగినట్టు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరారు. ఈ నిరసనలో ఉద్యోగులు రవీందర్, యాదగిరి, పృథ్వీరాజ్, కిషన్ రేష్మా, సాయి, విజయ్, నవీన్, అంజయ్య, వెంకటేశ్, నాగయ్య ఉన్నారు.

## వేంకటేశ్వరుడి వార కల్యాణం వాయిదా

చిల్పూరు, డిసెంబర్ 15 : ప్రతి శనివారం నిర్వహించే చిల్పూరు శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం వాయిదా వేసినట్లు ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న తెలిపారు. డిసెంబర్ 16(శనివారం)నుంచి ధనుర్మాసం (మార్గాళి మాసము) ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే స్వామి వారి కల్యాణాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి గోదా కల్యాణం నుంచి ప్రతి శనివారం యథావిధిగా కల్యాణం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. భక్తులు సహకరించి ధనుర్మాస ఉత్సవాల్లో పాల్గొనాలని లక్ష్మీప్రసన్న కోరారు.


పాలకుర్తిలోని రేషన్ షాపు

# రేషన్‌కు ఈ-కేవైసీ

- జనవరి 31 గడువు
- జిల్లాలో 335 రేషన్‌షాపులు..
- 1,61,148 రేషన్‌కార్డులు
- 4లక్షల85వేల910మంది లబ్ధిదారులు
- ఇప్పటి వరకు 66.89శాతం ఈకేవైసీ నమోదు పూర్తి

పాలకుర్తి, డిసెంబర్ 15 : ఆహార భద్రత కార్డు(రేషన్‌కార్డు)లో నమోదైన సభ్యులు తప్పని సరిగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని ప్రభుత్వం గతంలో ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా రేషన్ షాపుల్లో ఈకేవైసీ ప్రక్రియ కొనసాగింది. గడువు ముగియడంతో పూర్తి స్థాయిలో కేవైసీ చేసుకోలేకపోయారు. ఈ క్రమంలో ప్రభుత్వం మరోసారి గడువు విధించింది. 2024 జనవరి31లోపు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని సంబంధితశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయా రేషన్ షాపులలో ఈ-కేవైసీ కోసం లబ్ధిదారులు నమోదు చేసుకుంటున్నారు. రేషన్ షాపులు ఈ-కేవైసీ కోసం లబ్ధిదారులతో కిక్కిరిసి పోతున్నాయి.

### ఇప్పటి వరకు 66.89శాతం పూర్తి..

జిల్లాలో ఇప్పటి వరకు 66.89శాతం వరకు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 4లక్షల85వేల910 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు ఈ-కేవైసీ 3లక్షల25వేల 7మంది నమోదు చేశారు. మిగిలిన వారు తప్పని సరిగా జనవరి31 లోపు ఈకేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉంది.


రేషన్ షాపులో ఈకేవైసీ చేసుకుంటున్న లబ్ధిదారులు

రేషన్ బియ్యం అక్రమ దారి పట్టి దుర్వినియోగం కాకుండా లబ్ధిదారులకే అందే విధంగా చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ-కేవైసీకి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు పౌర సరఫరాలశాఖ అధికారులు తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని రేషన్ డీలర్లకు సైతం వారు ఆదేశించారు.

### జిల్లాలో 335 రేషన్ షాపులు..

జిల్లాలో 335రేషన్ షాపులు ఉన్నాయి. ఇందులో 1,61,148 కార్డులు ఉన్నాయి. వీటిలో అంత్యోదయ కార్డులు 10,698, ఆహార భద్రత కార్డులు1,50,151, అన్నపూర్ణకార్డులు 90వరకు ఉన్నాయి. ప్రతి నెలా కార్డుదారులకు 2,414.049 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తుంది.


### ఈకేవైసీ పరిశీలన ఇలా..

రేషన్‌కార్డు కలిగిన కుటుంబ యజమానితోపాటు కార్డులో పేర్లు ఉన్న సభ్యులందరూ ఈకేవైసీ నమోదు కోసం తప్పని సరిగా రేషన్ దుకాణానికి వెళ్లాలి. అక్కడ ఈ పాస్ యంత్రంలో వేలి ముద్రలు వేసి ఈకేవైసీ సరిచేకోవాల్సి ఉంటుంది. వేలిముద్ర వేయగానే రేషన్‌కార్డు నంబరుతోపాటు ఆధార్‌నంబర్ చూపిస్తుంది. ఈ ప్రక్రియలో ఆకుపచ్చ వెలుగు వస్తే సదరు వినియోగదారుని ఈ కేవైసీ పూర్తిస్థాయిలో విజయవంతంగా పునరుద్ధరించబడుతుంది. ఒక వేళ ఈకేవైసీ పునరుద్ధరణ యంత్రంలో రెడ్ వెలుగు వస్తే సదరు వినియోగదారుని రేషన్‌కార్డు ఆధార్‌కార్డు సరిపోలక రిజెక్టు సూచిస్తుంది. ఈ ప్రకారం ఒక యూనిట్ రేషన్‌కార్డు నుంచి తొలగించబడుతుంది. ఒకవేళ ఒకరో ఇద్దరో గైర్హాజరు అయితే వాళ్ల కుటుంబం నుంచి దూరమయ్యారని గుర్తిస్తూ, అందుబాటులో ఉన్న వ్యక్తుల ఈ కేవైసీ పరిశీలిస్తారు. ఈ ప్రక్రియలో గైర్హాజరైన రెండు యూనిట్ల వివరాలు ఈ పాస్ యంత్రంలో నమోదై ఉంటాయి. తద్వారా రెండు యూనిట్లను తొలగిస్తారు.

### ఇతర ప్రాంతాల్లో నివసించేవారికి ఎలా..?

ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు ఈకేవైసీ చేసుకోవడం ఇబ్బంది పడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండే వారు అక్కడే అందుబాటులో ఉండే ఏ రేషన్ షాపుకైనా వెళ్లి ఫుడ్ సెక్యూరిటీ కార్డు నంబర్ చూపించి ఈకేవైసీ చేసుకునే అవకాశం ఉంది. కొందరు ఇతర రాష్ర్టాలు, దేశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. వారి కోసం ఆన్‌లైన్ ద్వారా ఈకేవైసీ నమోదు చేసే ప్రక్రియను చేపడితే బాగుంటుందని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి..



జిల్లాలో రేషన్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఈ పాస్ యంత్రంలో ఈకేవైసీ పునరుద్ధరించుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. 2024 జనవరి31 లోపు తప్పని సరిగా నమోదు చేసుకోవాలి. లబ్ధిదారులు సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. లేకపోతే రేషన్ బియ్యం సరఫరా నిలిపివేసే ఆస్కారం కూడా లేకపోలేదు. రేషన్ బియ్యం సరఫరా నిలిచిపోకుండా ఉండాలంటే ఇంట్లో ఎంతమంది సభ్యులుంటే (రేషన్ కార్డులలో పేర్లు) కలిగిన వారు ఈ కేవైసీ తప్పకుండా నమోదు చేసుకోవాలి. డీలర్లు ప్రత్యేక దృష్టితో ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే తహసీల్దార్లు డీలర్లకు ఆదేశాలు కూడా జారీ చేశారు.

*- రోజారాణి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి*

## తక్కువ ధరకే ఇంటర్‌నెట్ సేవలు

**ఎక్స్‌పోర్టు ఇన్‌ఫోటెక్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు సూరభ్‌సింగ్**

రఘునాథపల్లి, డిసెంబర్ 15 : గ్రామీణ ప్రాంతంలోని సామాన్య ప్రజలకు అతి తక్కువ ధరకే ఇంటర్‌నెట్ సేవలను అందించాలనే లక్ష్యంతోనే పీఎం వాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎక్స్‌పోర్టు ఇన్‌ఫోటెక్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్‌సంస్థ వ్యవస్థాపకుడు సూరభ్‌సింగ్ తెలిపారు. మండల కేంద్రంలోని అబ్దుల్‌మియా మీసేవ సెంటర్‌లో ప్రధానమంత్రి వాణి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం సౌజన్యంతో ఎక్స్‌పోర్టు ఇన్‌ఫోటెక్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సూరభ్‌సింగ్ మాట్లాడుతూ అతి తక్కువ ధరకు ఇంటర్‌నెట్ సేవలను అందించేందుకు పీఎం వాణి పథకం లక్ష్యమన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోకల శివకుమార్, సంస్థ ప్రతినిధులు స్వప్న, రిచా, సుశాంత్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మీసేవలో పీఎం వాణి పథకాన్ని ప్రారంభిస్తున్న సూరభ్‌సింగ్

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


స్టేషన్‌ఘన్‌పూర్ : పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లి గ్రామంతోపాటు జనగామ పట్టణ కేంద్రంలోని 'ఆవోపా' బిల్డింగ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ పట్టణంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గట్టు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శివునిపల్లిలో జనగామ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పార్శి కమలేశ్‌కుమార్ గుప్తా ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జనగామ జిల్లా కోశాధికారి అయిత బుచ్చిబాబు, రూరల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెలిదె వెంకన్న, సంఘం మండల మాజీ అధ్యక్షుడు నాగబండి వెంకట్రాంనర్సయ్య, బెలిదె సతీశ్, కొడ లక్ష్మీనారాయణ, వాసవి క్లబ్ మాజీ డిప్యూటీ గవర్నర్ తెల్లాకుల రామకృష్ణ, పాలకుర్తి శ్రీనివాస్, తుమ్మలపల్లి రవికిషన్, గౌరిశెట్టి శ్రీనివాస్, తుమ్మలపల్లి రవికిరణ్, పార్శి రంగారావు, అంచూరి శ్రీరాములు, నూక రమేశ్, పార్శి భువనేందర్, మాణిక్యం పాల్గొన్నారు.

## ముగిసిన దివ్యాంగుల జిల్లా స్థాయి క్రీడోత్సవాలు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడోత్సవాలు విజయవంతంగా ముగిసినట్లు సంక్షేమశాఖ జిల్లా అధికారి జయంతి తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుహాసిని ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన జయంతి మాట్లాడుతూ జూనియర్స్ (10–16), సీనియర్స్ (17–35) విభాగాల్లో పోటీలు జరిగినట్లు చెప్పారు. అంధులకు రన్నింగ్, షాట్‌పుట్, చెస్, బధిరులకు రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్, శారీరక దివ్యాంగులకు రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్, జావెలిన్ త్రో, వీల్ చైర్, బుద్ధి మాంద్యం వారికి రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ క్రీడోత్సవాలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. విజేతలకు శనివారం (నేడు) జిల్లా కేంద్రంలోని సిద్దిపేట రోడ్డు మార్గంలో ఉన్న గాయత్రి వేడుకల మందిరంలో బహుమతుల ప్రదానం ఉంటుందని జయంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ డీపీఎం వినీతరెడ్డి, జ్యోతి, సీడీపీవో రమాదేవి, పీఈటీలు, దివ్యాంగుల జిల్లా కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ సుహాసిని


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Tirumalagiri Branch వారు ఇచ్చిన బొగొట్టు ప్రకారం యావన్మందికి తెలుపునది ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్థి రిజిస్ట్రార్ తనఖా చేయించుకొని, శ్రీ/శ్రీమతి రేశపల్లి సుజాత, భర్త: వెంకటేశ్వర్లు గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకొన్నాము. కావున సదరు వ్యవహారముకు సంబంధించి, సదరు షెడ్యూలు స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్సు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నాటి నుండి (7) ఏడు దినములలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కాదు.

**SCHEDULE OF THE PROPERTY**

జిల్లా రిజిస్ట్రారు వరంగల్, సబ్-రిజిస్ట్రారు జనగాం వారి జ్యూరిస్‌డిక్షనులోను, జిల్లా పరిషత్ జనగాం, మండల పరిషత్తు దేవరుప్పుల, కడివెండి గ్రామ పంచాయితీ రికార్డులలో ఇంటి నెం. 7-77A1 గా నమోదై యున్నట్టి ఇల్లు గల ఖాళీ స్థలము విస్తీర్ణము 160.00 చ.గ.లు, సరియగు 133.78 చ.మీ.లలో, ఆర్.సి.సి. కట్టుబడి విస్తీర్ణము: 100.00 చ.అడుగులు కలిగిన ఇంటీరియర్ రెసిడెన్షియల్ ఏరియాలో ఈ దిగువ హద్దులు కలిగి ఉన్నది. హద్దులు: ఉత్తరము: రేశపల్లి అనిల్ కుమార్ గారి ఇల్లు, దక్షిణము: పెద్ది వెంకన్న గారి ఇల్లు, తూర్పు: 15 అడుగుల రోడ్డు, పడమర: బీసు సోమయ్య గారి ఇల్లు.

Sd/- **NALLELLA SURENDER, NALLELLA SUHAS**
ADVOCATES, H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HNK, Warangal. Cell: 9849365117